


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com


4PM
www.suryaa.com
శుక్రవారం
21-11-2025
పేజీలు: 02


# రాజు వెడ్స్ రాంబాయి రివ్యూ




నీది నాది ఒకే కథ, విరాట పర్వం లాంటి విలక్షణమైన సినిమాలతో దర్శకుడిగా తనకంటూ ఓ ముద్ర వేశాడు వేణు ఊడుగుల. ఆయన ఒక సినిమాకి షోరన్నర్‌గా ఉన్నారంటే ఖచ్చితంగా ఆసక్తి పెరుగుతుంది. 'రాజు వెడ్స్ రాంబాయి' కూడా అలానే ఆకర్షించింది. దీంతో పాటు ఈ సినిమా ట్రైలర్, సాంగ్ జనాల్లోకి వెళ్ళాయి. ఇందులో ఒక సంచలనమైన క్లైమాక్స్ వుంటుందనే ప్రచారం కూడా బాగా కలిసొచ్చింది. ఏమిటా సంచలనమైన ముగింపు? ఈ ప్రేమకథ ప్రేక్షకులని ఎంతలా హత్తుకుంది? రివ్యూలో చూద్దాం. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడక ముందు వరంగల్ — ఖమ్మం ప్రాంతంలో జరిగే కథ ఇది. రాజు (అఖిల్ రాజ్) బ్యాండ్ కొట్టడంలో దిట్ట. అదే గ్రామానికి చెందిన రాంబాయి (తేజస్విని రావ్)ని ప్రేమిస్తాడు. రాంబాయి తండ్రి వెంకన్న (చైతన్య జొన్నలగడ్డ) కూతురికి ప్రభుత్వ ఉద్యోగం ఉన్న కుర్రాడికే ఇచ్చి పెళ్లి చేయాలనుకుంటాడు. దీంతో రాజు—రాంబాయి తమ ప్రేమను నిలబెట్టుకోవడానికి ఓ నిర్ణయం తీసుకుంటారు. ఏమిటా నిర్ణయం ? వెంకన్న వారి పెళ్లిని ఆపడానికి ఏ స్థాయికి దిగజారాడు? వారి ప్రేమ ఎలాంటి మలుపులు తిరిగింది? అన్నది మిగతా కథ. హానర్ కిల్లింగ్ జానర్ కథ ఇది. అన్ని వర్గాలు, స్థాయిల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని చెప్పడం ఇందులో స్పెషాలిటీ. ఇందులో హత్య వుండదు కానీ ఉప్పెన సినిమా తరహాలో క్లైమాక్స్ హార్డ్ హిట్టింగ్ గా వుంటుంది. నిజానికి ఆ సంఘటన ఆధారంగానే ఈ కథని రాసుకున్నాడు దర్శకుడు. ప్రీక్లైమాక్స్, క్లైమాక్స్ ఇంపాక్ట్ ఫుల్ గా కుదిరాయి. మిగతా భాగాల్లో వినోదం సాదాసీదాగానే వున్నాయి. పెళ్లికి ముందే గర్భవతి అయిన ఓ ప్రేమజంట పెళ్లి తంతుని చూపిస్తూ కథ మొదలౌతుంది. రాజు, రాంబాయ్, ఫ్రెండ్స్ గ్యాంగ్ లో మాస్ కామెడీ వినోదాన్ని పంచుతాయి. రాంబాయి ప్రేమకథ వెంకన్నకు తెలియడంతో కథలో ఓ సంఘర్షణ వస్తుంది. ఇంటర్వెల్ సీక్వెన్స్ ఆకట్టుకునేలా వుంటుంది. కాకపోతే సెకండ్ హాఫ్ కాస్త నెమ్మదించింది. అయితే దర్శకుడు బలంగా నమ్మిన క్లైమాక్స్ ఇంపాక్ట్ ఫుల్ గా కుదిరింది. ఇటీవల కాలంలో ఈ తరహా క్లైమాక్స్ రాలేదని చెప్పొచ్చు - - - షో రన్నర్ వేణు ఊడుగుల తాలూకు సెన్సిబిలిటీస్ ఈ సినిమాలో స్పష్టంగా కనిపించాయి ..మొత్తంగా ప్రేక్షకులు ఓ హృద్యమైన ప్రేమకథ చూశామనే భావనకు లోనవుతారు . రాజు పాత్రలో అఖిల్ చలాకీగా కనిపించాడు. ఎమోషనల్ సీన్స్ బాగా రాణించాడు. రాంబాయిగా తేజస్వినీ నటన సహజంగా వుంది. తెలంగాణ యాస పలికిన విధానం బావుంది. వెంకన్నగా చైతన్య జొన్నలగడ్డ విలనిజం కాస్త డిఫరెంట్ గా వుంటుంది. ట్రైలర్ లో ఒక ఇంప్రెషన్ క్రియేట్ చేసింది కానీ సినిమాలో అది భిన్నంగా వుంటుంది.

హీరో ఫ్రెండ్స్ గ్యాంగ్‌లో డాంబర్ పాత్ర అలరిస్తుంది. సురేశ్ బొబ్బిలి పాటలు, నేపథ్య సంగీతం సినిమాకి ప్రధాన ఆకర్షణ. కథని ఆయన సంగీతం ఎలివేట్ చేసింది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా వున్నాయి. సంభాషణలు సహజంగా వున్నాయి. దర్శకుడు కథని నిజాయితీ చెప్పే ప్రయత్నం చేశాడు. సహజమైన ప్రేమకథని ఇష్టపడే ప్రేక్షకులకు ఈ సినిమా మరింతగా నచ్చుతుంది.




## రాజాసాబ్ ఫస్ట్ సింగిల్ పోస్టర్ కెవ్వు కేక

ప్రభాస్ ఫ్యాన్స్ కి పూనకాలు తెప్పించే అప్డేట్ ఇచ్చారు 'రాజాసాబ్' డైరెక్టర్ మారుతి. మూవీ ఫస్ట్ సింగిల్ పోస్టర్ ను రిలీజ్ చేశారు. "మిమ్మల్ని 2000 కాలం నాటి డార్లింగ్ యుగానికి తీసుకెళ్ళే పాట రాబోతుంది" అనే క్యాప్షన్ తో పోస్టర్ షేర్ చేశారు. ఇందులో ప్రభాస్ లుక్, స్టైల్ అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. నవంబర్ 23న మొదటి పాట విడుదల కానున్నట్లు ప్రకటించారు.



## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దర్శించుకున్నారు. ఆలయ మహాద్వారం వద్ద ఆమెకు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అర్చకులు ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆమెకు వేదాశీర్వచనాలిచ్చి తీర్థప్రసాదాలను అందజేశారు. రాష్ట్రపతికి స్వామివారి చిత్రపటాన్ని టీటీడీ చైర్మన్ అందించారు. రెండు రోజుల పర్యట నిమిత్తం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీపద్మావతి విశ్రాంతి గృహంలో బసచేశారు. తిరుమల పర్యటన అనంతరం హైదరాబాద్‌కు చేరుకోనున్నారు.



## ఢిల్లీకి క్యూ కట్టిన కన్నడ నేతలు

కర్ణాటకలో 2023లో అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అందులో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అయితే ఆ సమయంలో రెండున్నర ఏళ్ళ తర్వాత అధికార పంపిణీ ఉంటుందని చెప్పింది. దీంతో సిద్ధ రామయ్య ముఖ్యమంత్రి అయ్యారు. అయితే ఈరోజు సిద్ధరామయ్య సర్కారుకు రెండున్నరేళ్ళు నిండాయి. దీంతో సీఎం పదవిని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కు ఇవ్వాలనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. బీహార్ ఎన్నికల పరాభవంతో కామ్ గా ఉన్న కాంగ్రెస్ అధిష్టానం కర్నాటకను పట్టించుకోవడం లేదు. కానీ సిద్ధ రామయ్య, డీకే మద్దతుదారులు మాత్రం ఇవేవీ పట్టించుకోకుండా ఢిల్లీకి వెళ్ళి వస్తున్నారు.

**న్యాయంగా నాకే రావాలి..**

మరోవైపు ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై డీకే శివకుమార్ అసహనంగా ఉన్నారు. తన బాధలు, డిమాండ్లు చెప్పకోవడానికి నిన్న మద్దతుదారులతో కలిసి ఢిల్లీకి వెళ్ళారు. ఈరోజు డాక్టర్ రంగనాథ్, బాలకృష్ణ, ఇక్బాల్ హుస్సేన్, గుబ్బి శ్రీనివాస్ ఎమ్మెల్యేలతో పాటూ మరో పది మంది ఎమ్మెల్యేల బృందం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ను కలవనున్నారు. దీని కంటే ముందు పీసీసీ అధ్యక్షుడిగా తాను ఎక్కువ రోజులు కొనసాగలేనని డీకే సంకేతాలిచ్చారు.

**దిక్కు తోచని స్థితిలో అధిష్టానం..**

అయితే వరుసగా ఎన్నికల్లో ఓడిపోతూ..బీహార్ లో దారుణంగా ఓటమి పాలైన కాంగ్రెస్ అధిష్టానం ప్రస్తుతం నైరాశ్యంలో కూరుకుపోయింది. ఇప్పుడు కర్ణాటక విషయం పట్టించుకునే స్థితిలో లేదని తెలుస్తోంది. దాంతో పాటూ ఇప్పుడు దక్షిణాదిలో కీలకమైన కర్ణాటకలో నాయకత్వాన్ని మారిస్తే వ్యతిరేకత వచ్చి 2028 ఎన్నికల్లో ఆ ప్రభావం కనిపిస్తుందని అంచనా వేస్తోంది. పైగా సిద్ధరామయ్యను తప్పిస్తే గందరగోళం ఏర్పడవచ్చని..ఆయనకు బలంగా ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులూ గొడవ చేయవచ్చని భావిస్తోంది.


## నాగార్జున, వెంకటేష్‌లకు షాక్.. స్టూడియోలకు జీహెచ్ఎంసీ నోటీసులు

టాలీవుడ్ అగ్ర హీరోలు నాగార్జున, వెంకటేష్ లకు జీహెచ్ఎంసీ షాక్ ఇచ్చింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియో, రామానాయుడు స్టూడియోలకు జీహెచ్ఎంసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. పూర్తి స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సిందే అంటూ అధికారులు నోటీసులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అన్నపూర్ణ, రామానాయుడు స్టూడియోలు ట్రేడ్ లైసెన్స్ ఫీజు తక్కువ చెల్లిస్తున్నట్టు జీహెచ్ఎంసీ సర్కిల్ 18 అధికారులు గుర్తించారు. వ్యాపార విస్తీర్ణం తక్కువ చూపిస్తూ భారీగా పన్నుల ఎగవేస్తున్నట్లు వెల్లడించారు. అన్నపూర్ణ స్టూడియో విస్తీర్ణానికి సంబంధించి 11.52 లక్షలు ఫీజు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 49వేలు మాత్రమే చెల్లిస్తోంది. అలాగే, రామానాయుడు స్టూడియో విస్తీర్ణం ప్రకారం 1.92 లక్షలు చెల్లించాల్సి ఉండగా.. కేవలం 1900 మాత్రమే చెల్లిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు చెల్లించాల్సిందే అంటూ నోటీసులు జారీ చేశారు.





## బంగ్లాదేశ్‌లో భారీ భూకంపం

పొరుగుదేశం బంగ్లాదేశ్‌లో భారీ భూకంపం సంభవించింది. రాజధాని ఢాకాలో శుక్రవారం ఉదయం 10:08 గంటల సమయంలో భూ ప్రకంపనలు నమోదయ్యాయి. రిక్టరుస్కేలుపై భూకంపం తీవ్రత 5.5గా నమోదైనట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే తెలిపింది. ఢాకాకు 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సింగ్‌డిలో భూకంప కేంద్రాన్ని గుర్తించినట్లు పేర్కొంది. భూమికి 10 కిలోమీటర్ల లోతులో భూకంపం సంభవించినట్లు వెల్లడించింది. ఈ భూకంపం బంగ్లాదేశ్-ఐర్లాండ్ మధ్య ఢాకా వేదికగా జరుగుతున్న టెస్ట్ మ్యాచ్‌కు అంతరాయం కలిగింది. ప్రకంపనలతో కొన్ని నిమిషాల పాటూ మ్యాచ్ ఆగిపోయింది. ఆ తర్వాత కొనసాగించారు. అయితే, ఈ విపత్తులో ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించి ఇప్పటి వరకూ ఎలాంటి సమాచారం లేదు. మరోవైపు ఈ ప్రకంపనల ధాటికి భారత్‌లోనూ భూమి కంపించింది. కోల్‌కతా సహా ఉత్తర భారతంలో ప్రకంపనలు నమోదయ్యాయి. కోల్‌కతాలో ఉదయం 10:10 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటూ భూమి కంపించింది. బెంగాల్‌లోని కూచ్‌బెహార్, దక్షిణ్, ఉత్తర దినాజ్‌పూర్ సహా పలు ప్రాంతాల్లో ప్రకంపనలు సంభవించాయి. గువాహటి, అగర్తల, షిల్లాంట్ వంటి నగరాల్లోనూ భూమి కంపించింది. ఈ భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఒక్కసారిగా ఇళ్ల నుంచి బయటకు పరుగులుతీశారు.



## కాప్ సదస్సులో అగ్నిప్రమాదం.. 21 మందికి గాయాలు

బ్రెజిల్‌లోని బెలెమ్‌లో నిర్వహిస్తున్న కాప్-30 సదస్సులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో 21 మంది గాయపడ్డారు. మైక్రోవేవ్‌లో మంటలు రేగడంతో ఈ ప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా బ్రెజిల్ కేంద్రంగా నిర్వహిస్తున్న కాప్-30 సదస్సులో వాతావరణ సంక్షోభం పరిష్కారానికి అంతర్జాతీయ ప్రయత్నాల బలోపేతానికి ఒప్పందం కుదుర్చుకోవడంపై చర్చలు జరుగుతున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకోవడం కొంత ఆందోళనకు దారి తీసింది. అయితే సంబంధిత అధికారులు అప్రమత్తమవ్వడంతో భారీ ప్రమాదం తప్పింది.



## టమోటా @50

కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధర భారీగా పెరిగింది. కిలో ధర ఏకంగా రూ.50కి చేరింది. కొన్ని రోజులుగా మార్కెట్‌లో టమోటాకు డిమాండ్ పెరిగింది. ఆశించిన స్థాయిలో మార్కెట్‌లో కాయలు లేకపోవడం, ఎగుమతి ప్రాంతాల్లో కూడా అదే పరిస్థితి ఉండడం ధర పెరుగుదలకు కారణమని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి. గురువారం గరిష్టంగా కిలో రూ.50తో అమ్ముడుపోయాయి. కనిష్ఠంగా రూ.27, సరాసరి రూ.37తో విక్రయాలు జరిగినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 1,875 టన్నుల కాయలు వచ్చాయన్నారు.



## అనన్య పాండే హాట్ స్టిల్స్

విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన లైగర్ సినిమాతో టాలీవుడ్ ప్రేక్షకులకు పరిచయమైంది బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే. లేలేత అందాలతో కుర్రకారు మనసు దోచేయడానికి ప్లాన్ చేసింది. అయితే ఈ బోల్డ్ బ్యూటీ సోకులు తెలుగు ప్రేక్షకులకు అంతగా రుచించలేదు.విడుదలకు ముందు లైగర్ సినిమా నుంచి వదిలిన పోస్టర్స్, వీడియోస్ లో అనన్య పాండే అందాల విందు చూసి మైమరచిపోయిన తెలుగు ప్రేక్షకలోకం.. తీరా సినిమా విడుదల తర్వాత అనన్యను పెద్దగా పట్టించుకోలేదు. కాకపోతే జనం మదిలో అనన్య పేరు అలా పాతుకుపోయింది.ఇదిలా ఉంటే అమ్మడి హాట్ పిక్స్‌తో ఆన్ లైన్ మాధ్యమాలు షేక్ అవుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా తన హాట్ ఫొటోస్ కొన్ని షేర్ చేసింది అనన్య పాండే. ఈ ఫొటోల్లో ఆమె అందాలు చూసి ఫిదా అవుతున్నారు నెటిజన్లు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## హాట్ నెస్‌కు కేరాఫ్ అడ్రస్

తెలుగులో ఎంతో మంది ముద్దుగుమ్మలు తమ అందచందాలతో, నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కానీ ఆతర్వాత టాలీవుడ్ కు దూరం అయ్యారు. తెలుగులో కొన్ని సినిమాలే చేసి ఆ తర్వాత బాలీవుడ్ కు చెక్కేసినవారు చాలా మంది ఉన్నారు. కొంతమంది ముద్దుగుమ్మలు ఒకటి రెండు సినిమాలతోనే పరిమితం అవుతున్నారు. పెళ్లి చేసుకొనో.. లేక అవకాశాలు లేక సినిమాలకు దూరం అయ్యారు. ఒక ముద్దుగుమ్మ తెలుగులో రెండే సినిమాలు చేసింది. అందులో ఒకటి డిజాస్టర్ కాగా ఓ సినిమా సంచలన విజయం సాధించింది. కానీ ఈ బ్యూటీకి ఆఫర్స్ మాత్రం లేదు. ఇప్పుడు ఒకొక్క సినిమాకు రూ. 3 కోట్లు వసూల్ చేస్తుంది ఈ చిన్నది. అలాగే ఆమె ఆస్తి పాస్తులు కూడా కోట్లల్లో ఉన్నాయి. అంతే కాదు ఇండస్ట్రీలో ఆమెను మించిన హాట్ బ్యూటీ లేదు. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా..?ఆతర్వాత బాలీవుడ్ కు చెక్కేసింది అక్కడ వరుసగా సినిమాలు చేసింది ఈ బ్యూటీ.. కానీ ఆ సినిమాలు అంతగా ప్రేక్షకులను ఆకట్టుకోలే కపోయింది.

### ప్రైవేటు వ్యక్తుల లబ్ధి కోసమే 'ఫార్ములా- ఈ' కుట్ర..

# ఏసీబీ సంచలన ఆరోపణ

ఫార్ములా-ఈ రేసు కేసు కేటీఆర్ మెడకు చుట్టుకొంటోంది. ఈ కేసులో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) విచారణలో సంచలన విషయాలు వెలుగు చూస్తున్నాయి.ఈ విషయంలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని ఏసీబీ ఆరోపిస్తోంది. కొంతమంది ప్రైవేటు వ్యక్తుల కోసమే ఈ రేసును నిర్వహించారని, వారి ప్రతిపాదనను నాటి ప్రభుత్వం తన మీద వేసుకున్నదని, దీనివల్ల ప్రజాధనం భారీగా దుర్వినియోగం అయిందని, ఈ మొత్తం ప్రక్రియలో అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని.. అవినీతి నిరోధక శాఖ ఆరోపిస్తోంది. కాగా ఈ కేసులో ఫార్ములా-ఈ ఆపరేషన్స్(ఎఫ్ఈవో) ప్రతినిధి అల్బెర్టో లాంగోతోపాటు ప్రైవేటు కన్సల్టెంట్ గువ్వాడ కృష్ణారావును కూడా నిందితులుగా చేర్చినట్లు తెలిపింది. కాగా, నివేదిక లోని అంశాలను బట్టి హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేసు నిర్వహించాలని ప్రభుత్వ పరంగా ఎలాంటి ప్రతిపాదన రాలేదని తెలుస్తోంది. 2021 నవంబరులో కొంతమంది ప్రైవేటు వ్యక్తుల మధ్య చర్చ మేరకు ఈ మొత్తం వ్యవహారానికి తెరలేచిందని ఏసీబీ ఆరోపించింది..ఈ కేసులో ఎ-4గా చేర్చిన అంతర్జాతీయ క్రీడల కన్సల్టెంట్ గువ్వాడ కృష్ణారావు దీనికి ఆద్యుడని తెలుస్తోంది. భారత్‌లో ఫార్ములా-ఈ రేసు తీసుకురావాలని భావించిన ఆయన తన పాత మిత్రుడు దిల్‌భాగ్ గిల్‌తో చర్చించారు. ఇదే విషయమై 2021 నవంబరు 18న టీహబ్‌లో ఇచ్చిన



ప్రజంటేషన్‌లో వీరు పాల్గొన్నారు. ఆర్థిక, వ్యాపారపరమైన సహకారం కోసం గువ్వాడ కృష్ణారావు.. గ్రీన్‌కో వ్యవస్థాపకుడు చెలమలశెట్టి సునీల్‌ను సంప్రదించినట్లు తెలిసింది. అనంతరం మరోసారి జరిగిన సమావేశానికి కేటీఆర్‌తోపాటు పలువురు ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. దీన్నిబట్టి ఫార్ములా ఈ కుట్ర ప్రభుత్వం నుంచి మొదలుకాలేదని.. ప్రైవేటు వ్యక్తులే శ్రీకారం చుట్టారని అవినీతి నిరోదక శాఖ (ఏసీబీ) పేర్కొంది.

### రేవంత్ రెడ్డి భారీ భూ కుంభకోణాన్ని

# బయటపెట్టిన కేటీఆర్

రాష్ట్రంలో భారీ భూకుంభకోణం జరుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఏకంగా నాలుగు లక్షల కోట్ల విలువచేసే భూమిని కొల్లగొట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి ముఠా కుట్ర చేస్తున్నదని ఆయన సంచలన ఆరోపణ చేశారు. కేటీఆర్ తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూములు ఎక్కడున్నా రేవంత్ ముఠా అక్కడ వాలిపోతోందని అన్నారు. ఎంతో విలువైన భూములపై రేవంత్ కుటుంబసభ్యుల కన్ను పడిందని ఆరోపించారు. బాలానగర్ పరిసరాల్లో సుమారు 9300 ఎకరాల భూకుంభకోణం జరుగుతోందని చెప్పారు. బాలానగర్, కాటేదాన్, జీడిమెట్లలో రేవంత్ తన వాళ్లకు భూములిచ్చారని విమర్శించారు. మొత్తం నాలుగు లక్షల కోట్ల కుంభకోణం జరుగుతోందని ఆరోపించారు. జపాన్‌లో ఉన్నప్పుడు కూడా ఆ భూమికి సంబంధించిన ఫైల్‌పై రేవంత్ ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ప్రతి ప్రభుత్వం పారిశ్రామికవేత్తలకు రాయితీలు ఇస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం హైదరాబాద్‌లో అతిపెద్ద భూకుంభకోణానికి తెరలేపిందని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో 2022లో భూముల రెగ్యులేషన్ కోసం చట్టం తీసుకొచ్చామని, భూములకు వంద శాతం ఫీజులు చెల్లించేలా నిబంధన చేర్చామని కేటీఆర్ తెలిపారు. భూములు వేరేవాళ్లకు అమ్ముకుంటే రెండు వందల శాతం చెల్లించాలని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు పట్టించుకోకుండానే భూ కేటాయింపులు చేసిందని విమర్శించారు. 30 శాతం చెల్లిస్తే రెగ్యులర్ చేస్తామని ఉత్తర్వులు ఇచ్చారని ఆరోపించారు.





## భారీగా తగ్గిన బంగారం ధర

నిన్న ఒక్కసారిగా పెరిగి భయపెట్టిన బంగారం , వెండి ధరలు(gold-and-silver-rates) ఒక్కరోజులోనే కిందకు పడిపోయాయి. ఎవరూ ఊహించని విధంగా భారీగా తగ్గింది. గు వేయాల్సి వచ్చింది. అయితే, పసిడి ప్రియులకు ఈరోజు అదిరే శుభవార్త అందింది. అమెరికా డాలర్ ఇండెక్స్ 100 మార్క్ దాటడంతో పాటు ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్ల తగ్గింపు ఉండకపోవచ్చన్న సంకేతాలు బంగారం ధరలు భారీగా తగ్గడానికి కారణమయ్యాయి. దీంతో నిన్న తులం బంగారం రూ.1.25 లక్షలు దాటగా అది ఇవాళ 1, 24, 260కి చేరింది. దాదాపు రూ.600 వరకు తగ్గింది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 13, 900కి చేరింది. ఇదే బంగారం నిన్నటి ధర రూ. 1,14, 450 గా ఉంది. అంటే రూ. 550 తగ్గింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1, 24, 410కి చేరింది. 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ. 1, 14, 050 కి చేరుకుంది. ఇక హైదరాబాద్, విజయవాడల్లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1, 24, 260గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రేటు రూ. 1, 13, 900కి దిగింది.



## తెలంగాణ బాక్సర్ నిఖత్ ఖాతాలో మరో స్వర్ణం

బాక్సర్ నిఖత్ జరీన్(nikhat-zareen) మరోసారి దుమ్ముదులిపింది. తన ఫామ్ ను నిరూపించుకుంటూ స్వర్ణంతో మెరిసింది. ప్రపంచకప్ బాక్సింగ్(boxing) ఫైనల్లో నిన్న మహిళల 51 కేజీల విభాగంలో నిఖత్ 5-0తో చైనీస్ తైపీ అమ్మాయి గవో యీ గ్జువాన్ ను ఓడించింది. తొలి రౌండ్ నుంచే ప్రత్యర్థిపై ఎదురుదాడి చేసిన నిఖత్.. పదునైన పంచ్‌లతో విరుచుకుపడింది. ఆఖరిదాకా అదే జోరు కొనసాగించి తేలిగ్గా విజయాన్ని సొంతం చేసుకుంది. టీవల ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో క్వార్టర్స్‌లోనే ఓడిన ఈ తెలంగాణ అమ్మాయి నిఖత్ మళ్ళీ తనను తాను నిరూపించుకుంది. నిఖత్ కు వచ్చిన స్వర్ణంతో ప్రపంచ కప్ బాక్సింగ్ లో బారత్ ఖాతాలో ఎనిమిది పసిడి పతకాలు చేరాయి. 57 కేజీల్లో పారిస్ కాంస్య పతక విజేత చైనీస్ తైపీ వుయీను జైస్మిన్ లాంబోరియా 57 కేజీల విభాగంలో కంగుతినిపించగా.. 60 కేజీల్లో జాప్ అమ్మాయి తగుచి అయాకాను పర్వీన్ హుడా చిత్తు చేసింది. 80 కేజీల్లో ఉజ్బెకిస్తాన్ కు చెందిన సొటిమ్‌బొయెవాను నుపుర్ షెరోన్ ఓడించింది. అలాగే 70 కేజీల్లో అదే ఉజ్బెకిస్తాన్ చెందిన అజీజాపై అరుంధతి చౌదరి పైచేయి సాధించింది. 54 కేజీల్లో ఇటలీకు చెందిన సిరిన్ పై ప్రీతి పన్వర్.. 48 కేజీల్లో ఫోజిలివా పై మీనాక్షి హుడా గెలిచి పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. పురుషుల 70 కేజీల తుదిపోరులో కజకిస్తాన్ కు చెందిన నార్‌బెక్ పై హితేశ్ గులియా.. 60 కేజీల్లో మునార్‌బెక్ పై సచిన్ సివాచ్ గెలిచి స్వర్ణాలు కైవసం చేసుకున్నారు.

## టీమిండియాకు భారీ దెబ్బ!

టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తీవ్రమైన మెడ నొప్పి కారణంగా దక్షిణాఫ్రికాతో జరగబోయే రెండో టెస్ట్ మ్యాచ్‌కు దూరమయ్యారు. గత కొద్ది రోజులుగా ఈ సమస్యతో బాధపడుతున్న గిల్ ఇప్పటికే ICUలో చికిత్స అందుకున్నారు. జట్టుతో పాటు గువాహటికి చేరుకున్నప్పటికీ, పూర్తిగా కోలుకోలేకపోయారు. ఈ పరిస్థితుల్లో బుధవారం ఉదయం ఆయనకు ఫిట్‌నెస్ టెస్ట్ నిర్వహించగా, దురదృష్టవశాత్తు ఫెయిల్ అయ్యారు. ఫిట్‌నెస్ టెస్ట్‌లో విఫలమవడంతో బీసీసీఐ వైద్య బృందం, కోచింగ్ స్టాఫ్ ఆమోదంతో గిల్‌ను జట్టు నుంచి విడుదల చేయాలని నిర్ణయించారు. దీంతో రెండో టెస్ట్‌తోపాటు మిగతా సిరీస్‌కు కూడా ఆయన అందుబాటులో ఉండే అవకాశం దాదాపు లేకుండా పోయింది. భారత జట్టుకు ఇది పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు. కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన కొద్ది రోజులకే గిల్‌కు ఈ గాయం ఎంతో నిరాశ కలిగించింది. కొద్ది గంటల క్రితమే గిల్ ముంబైకి బయలుదేరి వెళ్లిపోయారు. అక్కడ



ప్రముఖ వైద్య నిపుణుల పర్యవేక్షణలో తదుపరి మూడు రోజుల పాటు విశ్రాంతి, పునరావాస చికిత్స తీసుకోనున్నారు. ఈ చికిత్స తర్వాతే ఆయన తిరిగి మైదానంలోకి ఎప్పుడు దిగుతారనేది స్పష్టమవుతుందని వైద్య వర్గాలు తెలిపాయ. ఇప్పటికైతే ఆయన ఆరోగ్యమే ప్రధాన లక్ష్యమని బీసీసీఐ అధికారులు పేర్కొన్నారు. గిల్ లేకుండా రెండో టెస్ట్‌కు భారత జట్టు ఎలా సిద్ధమవుతుందనేది ఇప్పుడు అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. కొత్త కెప్టెన్‌గా ఎవరు బాధ్యతలు తీసుకుంటారు, మిడిల్ ఆర్డర్‌లో ఆ ఖాళీని ఎవరు నింపుతారు అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దక్షిణాఫ్రికా సిరీస్ ఇప్పటికే భారత్‌కు కీలకం కాగా, గిల్ గైర్హాజరీతో ఒత్తిడి మరింత పెరిగినట్లు కనిపిస్తోంది.

## భన్సాలీ బ్యానర్‌లో మృణాల్ కొత్త మూవీ

బాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థలు జీ స్టూడియోస్, భన్సాలీ ప్రొడక్షన్స్ కలిసి ఒక భారీ ప్రాజెక్ట్‌ను నిర్మించబోతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కి 'దో దీవానే షెహర్ మే' అనే టైటిల్‌ను ఖరారు చేయగా.. ఇందులో బాలీవుడ్ నటుడు సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటించబోతున్నారు. లవ్ స్టోరీగా రాబోతున్న ఈ చిత్రంకి రవి ఉద్యవార్ దర్శకత్వం వహిస్తుండగా.. సంజయ్ లీలా భన్సాలీ, ప్రేరణ సింగ్, ఉమేష్ కుమార్ బన్సాల్, భరత్ కుమార్‌లు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఫిబ్రవరి 26న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ సందర్భంగా మూవీ నుంచి అనౌన్స్‌మెంట్ వీడియోను పంచుకుంది చిత్రయూనిట్. ఈ టీజర్ చూస్తుంటే మెట్రో లవ్‌స్టోరీగా ఈ సినిమా రాబోతున్నట్లు తెలుస్తుంది.




## మిస్ యూనివర్స్‌గా ఫాతిమా బోష్

ఈ ఏడాది మిస్ యూనివర్స్‌గా మెక్సికో భామ ఫాతిమా బోష్ నిలిచారు. థాయ్‌లాండ్ వేదికగా జరిగిన విశ్వ సుందరి పోటీల్లో ఫాతిమా విజేతగా నిలిచారు. దీంతో గతేడాది మిస్ యూనివర్స్‌గా నిలిచిన డెన్మార్క్ భామ విక్టోరియా కెజార్ హెల్విగ్.. ఫాతిమాకు మిస్ యూనివర్స్ కిరీటాన్ని అలంకరించారు. పోటీల్లో తొలి రన్నరప్‌గా థాయ్‌లాండ్‌కు చెందిన ప్రవీనర్ సింగ్, రెండో రన్నరప్‌గా వెనెజువెలాకు చెందిన స్టిఫానీ అబాసలీ నిలిచారు. కాగా, మిస్ యూనివర్స్ 2025లో భారత్‌కు తీవ్ర నిరాశ ఎదురైంది. ఈ పోటీల్లో భారత్ తరఫున రాజస్థాన్‌కు చెందిన మణిక విశ్వకర్మ పోటీల్లో పాల్గొన్నారు. ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్న మణిక టాప్ 30 వరకూ రాగలిగింది. ఆ తర్వాత న్యాయనిర్ణేతలను ఆకట్టుకోవడంలో విఫలమైంది. టాప్ 12లో స్థానం సంపాదించలేకపోయింది. దీంతో భారత్‌కు ఈ ఏడాది మిస్ యూనివర్స్ కిరీటం చేజారింది. కాగా, జైపుర్‌లో ఈ ఏడాది ఆగస్టులో జరిగిన మిస్ యూనివర్స్ ఇండియా కిరీటాన్ని సొంతం చేసుకున్న మణిక మిస్ యూనివర్స్‌కు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు అర్హత సాధించారు.

